వరంగల్ వాయిస్
Evening Daily
సంపుటి : 04 | సంచిక : 272
పేజీలు : 08 | వెల: రూ.5/-
శనివారం
ఆగస్టు 02, 2025
www.epaper.warangalvoice.net | www.warangalvoice.net



## నాయినిని కలిసిన ఈఓ

భద్రకాళి దేవస్థానం కార్యనిర్వహణాధికారిగా బాధ్యతలు చేపట్టిన రామల సునీత శనివారం వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి స్వగృహంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డికి పుష్ప గుచ్ఛం అందజేసి, అమ్మవారి శేష వస్త్రాలు బహుకరించారు. ఈ సందర్భంగా అమ్మవారి ప్రసాదాలను ఎమ్మెల్యేకు అందజేశారు.
– వరంగల్ వాయిస్, కాశిబుగ్గ

# మాడిన అన్నం.. గొడ్డు కారం

### ట్రైబల్ వెల్ఫేర్ బాలికల గురుకులంలో ఆహారం




- తినలేక పస్తులుంటున్న విద్యార్థులు
- మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ తనిఖీతో వెలుగులోకి
- మన బిడ్డలకు ఇలాగే పెడతామా అంటూ నిలదీత



సాక్షాత్తు కలెక్టర్, జిల్లా అధికార యంత్రాంగం నిత్యం సంచరించే మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ట్రైబల్ వెల్ఫేర్ బాలికల గురుకులంలోని విద్యార్థినులకు మాడిన అన్నం..గొడ్డు కారమే దిక్కైంది. తింటే తిను లేకుంటే పస్తులుండు అన్నట్లుగా అక్కడి వార్డెన్లు వ్యవహరించడంపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతోంది. ప్రభుత్వం ఒకవైపు విద్యార్థులకు మెరుగైన భోజనం వడ్డిస్తున్నామంటూ ప్రకటనలు చేస్తున్నప్పటికీ క్షేత్ర స్థాయిలో మాత్రం అది అమలుకు నోచుకోవడం లేదు. కలెక్టర్లు గురుకులాలను నెలకోసారి విజిట్ చేస్తున్నా పరిస్థితిలో మార్పు రావడంలేదు. కలెక్టర్లు, ఇతర అధికారులు క్షేత్ర స్థాయి పరిశీలనకు వస్తున్నారని ముందే తెలుసుకుంటున్న గురుకులం నిర్వాహకులు ఆ ఒక్క పూట మాత్రం విద్యార్థులకు పంచభక్ష పరమాన్నాలు అందించి అధికారుల చేత శభాష్ అనిపించుకుంటున్నారు. వారు పోయిన తర్వాత మాడిన అన్నం.. గొడ్డు కారమే వడ్డిస్తున్నారన్నది పచ్చి నిజం. శనివారం మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ తనిఖీతో విద్యార్థులకు వడ్డిస్తున్న భోజనం వెలుగులోకి వచ్చింది. మన బిడ్డలకు ఇలాగే పెడతామా అంటూ ఆమె అక్కడి అధికారులను నిలదీశారు. –వరంగల్ వాయిస్, మహబూబాబాద్

వివరాలు2లో..



## నాణ్యమైన భోజనం అందించాలి

- హనుమకొండ కలెక్టర్ స్నేహ శబరీష్
- సాంఘిక సంక్షేమ బాలుర, బాలికల వసతి గృహాల్లో తనిఖీలు

2లో..

## పంట మార్పిడిపై అవగాహన అవసరం

- జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద
- మామునూరులో ఏరువాక సాగుబడి కార్యక్రమం




2లో..



8లో..

## అమ్మవారికి తొలి బోనం

ఆదివారం కుమ్మర్ల సంఘం ఆధ్వర్యంలో నిర్వహణ







# మాడిన అన్నం.. గొడ్డు కారం

- ట్రైబల్ వెల్ఫేర్ బాలికల గురుకులంలో ఆహారం
- తినలేక పస్తులుంటున్న విద్యార్థులు
- మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ తనిఖీతో వెలుగులోకి
- మన బిడ్డలకు ఇలాగే పెడతామా అంటూ నిలదీత

**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** వరంగల్ వాయిస్, మహబూబాబాద్ : జిల్లా కేంద్రంలోని ట్రైబల్ వెల్ఫేర్ బాలికల గురుకుల పాఠశాలలో శనివారం మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ పర్యటించారు. విద్యార్థినుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు గొడ్డు కారంతో బ్రేక్ ఫాస్ట్ పెట్టడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులకు ఆరోగ్యకరమైన భోజనం అందిస్తున్నామంటూ పేపర్లు, టీవీల్లో ప్రకటనలు చేస్తున్న ప్రభుత్వానికి మాడిన అన్నం.. గొడ్డు కారం కనిపించడంలేదా అని ప్రశ్నించారు. ముద్దలు, ముద్దలుగా ఉన్న అన్నం తినలేక విద్యార్థినులు ఖాళీ కడుపులతోనే తరగతి గదుల్లోకి వెళ్లడంపై ఆందోళన వ్యక్తం చేశారు. ఇదేనా కాంగ్రెస్ ప్రభుత్వం గురుకులాల్లో అందిస్తున్న భోజనం అంటూ నిలదీశారు.

### విద్యార్థులను పట్టించుకోరా..?

గురుకులాల్లో చదువుతున్న పేద, మధ్య తరగతి విద్యార్థులపై ప్రభుత్వానికి ఎందుకింత నిర్లక్ష్యం అంటూ సత్యవతి రాథోడ్ ప్రశ్నించారు. బావి భారత పౌరులుగా ఎదగాల్సిన విద్యార్థులకు మీరిచ్చే ఆహారం ఇదేనా అంటూ నిలదీశారు. విద్యార్థులు తినకుండా చెత్త బుట్టలో వేసిన అన్నాన్ని చూపించి మన బిడ్డలకు ఇలాగే పెడతామా అంటూ ప్రశ్నించారు. అనేక మంది గురుకుల విద్యార్థులు ఫుడ్ పాయిజన్ తో మృతి చెందుతున్నా ప్రభుత్వానికి చీమ కుట్టినట్లు కూడా లేదని విమర్శించారు. కేసీఆర్ ఆనవాళ్లు మారుస్తా అంటే విద్యార్థులు గురుకులానుంచి టీసీలు తీసుకుని వెళ్లిపోవడమా? అంటూ ప్రశ్నించారు. పలువురు విద్యార్థులు వారి సమస్యల సత్యవతి రాథోడ్ దృష్టికి తీసుకురాగా వాటిపై అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తానంటూ హామీ ఇచ్చారు.






## ఎన్విరాన్ మెంట్ ఎడ్యుకేషన్.. మాస్టర్ ట్రైనర్‌గా కొడిమాల శ్రీనివాసరావు

**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** ఎన్విరాన్మెంట్ ఎడ్యుకేషన్ మాస్టర్ ట్రేనర్ గా ఏవీవీ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి కొడిమాల శ్రీనివాసరావు నియమితులయ్యారు. ఈ మేరకు స్టేట్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ సీనియర్ సోషల్ సైంటిస్ట్ డాక్టర్ డబ్ల్యూజీ ప్రసన్నకుమార్ చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకున్నారు. తెలంగాణ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు హైదరాబాద్, నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మైక్రో, స్మాల్ అండ్ మీడియం ఎంటర్ ప్రైసెస్ హైదరాబాదు వారి సంయుక్త ఆధ్వర్యంలో ఆగస్ట్ 1, 2 తేదీల్లో ఎన్విరాన్మెంట్ ఎడ్యుకేషన్ ఫర్ మాస్టర్ ట్రైనర్ వర్క్ షాప్ నిర్వహించారు. ఈ వర్క్ షాప్ లో కాకతీయ యూనివర్సిటీ నుంచి పాల్గొన్న కొడిమాల శ్రీనివాసరావును మాస్టర్ ట్రేనర్ గా నియమించారు. ఈ సందర్భంగా కోడిమాల శ్రీనివాసరావు మాట్లాడుతూ కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని విద్యార్థులకు పర్యావరణ ఎడ్యుకేషన్ పై అవగాహన



# పంట మార్పిడిపై అవగాహన అవసరం

- జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద
- మామునూరులో ఏరువాక సాగుబడి కార్యక్రమం

**వరంగల్ వాయిస్, మామూనూరు :** పంట మార్పిడిపై రైతులు సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు. మామునూరు కృషి విజ్ఞాన కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన 'ఏరువాక రైతు బడి ' కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, వ్యవసాయ శాఖ డైరెక్టర్ అనురాధ, హార్టికల్చర్ అధికారి శ్రీనివాసరావు పాల్గొని రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఉత్తరప్రదేశ్ వారణాసి నుంచి వర్చువల్ గా నిర్వహించిన పీఎం కిసాన్ సమ్మాన్ నిధి విడుదల కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద తో పాటు రైతులు, వ్యవసాయ శాఖ అధికారులు వీక్షించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ రైతును రాజు చేయాలన్న ఉద్దేశంతో ఏరువాక రైతు బడి అనే కార్యక్రమాన్ని ప్రయోగాత్మకంగా శ్రీకారం చుట్టిందన్నారు. రైతులందరూ వ్యవసాయ శాఖ క్షేత్రస్థాయి అధికారులు, శాస్త్రవేత్తల సలహాలు సూచనలు పాటించి అధిక దిగుబడి సాధించాలని కలెక్టర్ రైతులకు సూచించారు. జిల్లాలో సన్న బియ్యం పంటతో పాటు కూరగాయలు, పందిరి సాగు మొక్కలు, కంది, పెసర, జొన్న, మొక్కజొన్న తదితర పంటలు కూడా అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని పేర్కొన్నారు. ప్రభుత్వ విధి విధానాలను వ్యవసాయ క్షేత్రస్థాయి అధికారులు, వ్యవసాయ శాస్త్రజ్ఞులతో పంటలపై అవగాహన కల్పిస్తూ ప్రోత్సాహం కల్పించాల్సిందిగా జిల్లా కలెక్టర్ అధికారులకు పలు సూచనలు ఇచ్చారు. అనంతరం ఎనుమాములలోని అక్షయపాత్ర భోజన తయారి యూనిట్ ను సందర్శించారు. హైజినిక్ క్వాలిటీ భోజనం తయారు చేసే విధానాన్ని కలెక్టర్ నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. జిల్లా వ్యవసాయ శాఖ డైరెక్టర్ అనురాధ మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ రైతులకోసం ఆరోగ్య దీపిక కార్డులను తయారు చేసి ఎరువుల వివరాలను పొందుపరిచే విధంగా తయారుచేసి రైతుల అవగాహన కల్పించడంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్, జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి పుష్పలత, సైంటిస్టులు, రైతులు పాల్గొన్నారు.

# నాణ్యమైన భోజనం అందించాలి

- హనుమకొండ కలెక్టర్ స్నేహ శబరీష్
- సాంఘిక సంక్షేమ బాలుర, బాలికల వసతి గృహాల్లో తనిఖీలు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** హాస్టల్ విద్యార్థులకు నాణ్యమైన, మెనూ ప్రకారం భోజనం అందించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ కోరారు. శనివారం హనుమకొండ గాంధీనగర్ టీవీ టవర్ సమీపంలోని షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలోని సాంఘిక సంక్షేమ బాలుర కళాశాల వసతి గృహం (బి), హనుమకొండ బాలసముద్రంలోని బాలికల కళాశాల వసతి గృహం (ఏ)ను జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వసతి గృహాలకు సంబంధించిన వివిధ రకాల రిజిస్టర్లను కలెక్టర్ తనిఖీ చేశారు. విద్యార్థుల సంఖ్య, వారి హాజరు శాతం గురించి కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. స్టోర్ రూమ్ లలో ఉన్న కూరగాయలు, ఇతర నిత్యావసర వస్తువులను పరిశీలించారు. విద్యార్థులకు ఏయే రోజుల్లో ఆహార పదార్థాలను అందించాలని తెలియజేసే మెనూ చార్ట్ ను కలెక్టర్ పరిశీలించారు. వసతి గృహ కార్యాలయాలు, కిచెన్, స్టోర్ రూమ్ లను పరిశీలించిన కలెక్టర్ డైనింగ్ హాలులో విద్యార్థుల కోసం వండిన భోజన పదార్థాలను తనిఖీ చేశారు. వసతి గృహాలకు సంబంధించిన వివరాలను సంబంధిత హాస్టల్ వార్డెన్లను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ వసతి గృహాలలో చదువుతున్న విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని, తాజా కూరగాయలనే వంటలకు వినియోగించాలన్నారు. హాస్టల్ పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలని సూచించారు. విద్యార్థులకు పరిశుభ్రమైన తాగునీరును అందించాలన్నారు. మెడికల్ క్యాంపులు నిర్వహించినప్పుడు విద్యార్థుల ఆరోగ్య స్థితిగతులను నమోదు చేయాలన్నారు. హాస్టల్స్ లో రోజు అటెండెన్స్ తో పాటు వివిధ రికార్డుల నిర్వహణ తప్పనిసరిగా చేయాలన్నారు. హాస్టల్స్ సిబ్బందిలో ఒకరు తప్పనిసరిగా అందుబాటులో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ వెల్ఫేర్ డీడీ నిర్మల, ఏఎస్ డబ్ల్యూఓ కృష్ణ, వార్డెన్లు రవికుమార్, జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# రైతుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

◆ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు



**వరంగల్ వాయిస్, మల్హర్:** రైతుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. శనివారం మల్హర్ మండలం తాడిచెర్లలో పలు అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తాడిచెర్ల గ్రామం మండల కేంద్రంగా ఉందని, ఇక్కడ రైతుల సౌకర్యాల కోసం ప్రభుత్వం పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతోందని పేర్కొన్నారు. ఇందులో భాగంగా రూ. 50 లక్షలతో నిర్మించిన సహకార సంఘ కార్యాలయం, గోదాం భవనం, రూ. 25 లక్షలతో నిర్మించిన గ్రంథాలయ భవనాలను ప్రారంభించారు. అలాగే, రూ. 7.80 లక్షల వ్యయంతో ఆర్ అండ్ బీ రోడ్డు నుంచి రైతు వేదిక వరకు నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు, రూ. 3.5 లక్షలతో పీఏసీఎస్ వద్ద నిర్మించనున్న ఆర్చిగేట్ నిర్మాణ పనులకు, రూ. 12 లక్షలతో నిర్మించనున్న తహసీల్దార్ కార్యాలయ ప్రహరీ గోడ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. సహకార సంఘం కార్యాలయం ద్వారా గ్రామీణ రైతులకు బ్యాంకు సేవలు, వ్యవసాయ రుణాలు సులభంగా అందుబాటులోకి వస్తాయని శ్రీధర్ బాబు తెలిపారు. కలెక్టర్ రాహుల్ శర్మ, అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజబాబు, సింగిల్ విండో చైర్మన్ ఇర్పా మొండయ్య, సహకార అధికారి వాలియా నాయక్, వ్యవసాయ అధికారి బాబూరావు, మహాదేవపూర్ ఏడీఏ శ్రీవ్యాళ్, తహసీల్దార్ రవి పాల్గొన్నారు.

## బీసీల అభివృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం..

వెనుకబడిన తరగతుల (బీసీ) అభివృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు అన్నారు. శనివారం మల్హర్ మండలం తాడిచెర్లలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన ఈ విషయం వెల్లడించారు. తాజాగా, బీసీ రిజర్వేషన్ల కోసం కేబినెట్ నిర్ణయించి ఆర్డినెన్స్ తీసుకొచ్చినా గవర్నర్ ఆమోదం లభించలేదని ఆయన పేర్కొన్నారు. బీసీ రిజర్వేషన్ల పట్ల కేంద్రంలోని బీజేపీకి చిత్తశుద్ధి ఉంటే, ఆ బిల్లును తక్షణమే 9వ షెడ్యూల్‌లో చేర్చాలని డిమాండ్ చేశారు. బిల్లు, ఆర్డినెన్స్ ఆమోదంలో జరుగుతున్న జాప్యాన్ని నిరసిస్తూ ఆగస్టు 5, 6, 7 తేదీలలో ముఖ్యమంత్రి అధ్యక్షతన ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ధర్నా నిర్వహించాలని నిర్ణయించినట్లు శ్రీధర్ బాబు తెలిపారు. ఈ సందర్భంగా, తాడిచెర్ల గ్రామానికి చెందిన దళిత యువకుడు దండు రమేష్‌ను తెలంగాణ ప్రభుత్వం ఎన్ఆర్ఈజీఎస్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా నియమించడాన్ని ఆయన దళితులకు దక్కిన గౌరవంగా అభివర్ణించారు. దండు రమేష్‌ను శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మల్హల్ రావు, సింగిల్ విండో చైర్మన్ ఇప్ప మొండయ్య, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి అయిత రాజి రెడ్డి, ఇతర కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రెడ్ క్రాస్ డే కేర్ సెంటర్ ప్రారంభం



**వరంగల్ వాయిస్, సుబేదారి :** వయోవృద్ధుల కోసం ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, హనుమకొండ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డే కేర్ సెంటర్‌ను వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన రిబ్బన్ కట్ చేసి వృద్ధులతో మాట్లాడారు. అనంతరం తలసీమియా వ్యాధితో బాధపడుతున్న పిల్లలకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేకు రెడ్ క్రాస్ చైర్మన్ డాక్టర్ పి. విజయచందర్ రెడ్డి, పాలకవర్గం సభ్యులు ఘన స్వాగతం పలికి, పూలమొక్కతో సత్కరించారు. రెడ్ క్రాస్ చైర్మన్ డాక్టర్ పి. విజయచందర్ రెడ్డి మాట్లాడుతూ, ఈ డే కేర్ సెంటర్ ద్వారా 60 ఏళ్లు పైబడిన వృద్ధులకు ఉచితంగా వైద్య సేవలు అందిస్తామని తెలిపారు. అంతేకాకుండా, చెస్, క్యారమ్ వంటి ఆటల సౌకర్యాలు కల్పించి, వారు విలువైన సమయాన్ని ఆనందంగా గడిపేందుకు ఏర్పాట్లు చేశామని పేర్కొన్నారు. ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడు, రాష్ట్రంలోని 33 జిల్లాల్లో 37 డే కేర్ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నామని, అందులో హనుమకొండలో మొదటి సెంటర్ ప్రారంభం కావడం గర్వకారణమని తెలిపారు. రక్తదానం, ఇతర సేవా కార్యక్రమాల్లో హనుమకొండ రెడ్ క్రాస్ రాష్ట్రంలో మొదటి స్థానంలో ఉందని ప్రశంసించారు. రెడ్ క్రాస్ సేవలకు మరింత తోడ్పాటు అందించాలని, త్వరలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని హనుమకొండ రెడ్ క్రాస్ సందర్శించేలా ప్రయత్నిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వృద్ధులను చేనేత కళాకారులు తయారు చేసిన టవల్స్‌తో సన్మానించారు. అనంతరం, పాలకవర్గం ఎమ్మెల్యేను షీల్డ్‌తో సత్కరించింది. కార్యక్రమంలో కోశాధికారి బొమ్మినేని పాపిరెడ్డి, రాష్ట్ర పాలకవర్గ సభ్యులు ఈ.వీ. శ్రీనివాస్ రావు, జిల్లా పాలకవర్గ సభ్యులు పుల్లూరు వేణుగోపాల్, డాక్టర్ ఎం.శేషుమాధవ్, బిళ్ల రమణా రెడ్డి, మహిళా శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమ అధికారి జయంతి, డీఆర్‌డీఓ పీడీ ఎం. శ్రీను, హనుమకొండ డీఎంహెచ్ఓ ఎ.అప్పయ్య, కేయూ ఈసీ సభ్యులు కె. అనిత రెడ్డి, వృద్ధులు, రెడ్ క్రాస్ సిబ్బంది పాల్గొన్నారు.

# అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలి

■ పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి



**వరంగల్ వాయిస్, పరకాల :** పట్టణంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి శనివారం సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన అధికారులకు పలు సూచనలు చేశారు. 19వ వార్డులోని పాత సీఎంఎస్ గోదాం, 14వ వార్డులోని పాత మసీదువాడ, గంద్రవాడలలో జరుగుతున్న డ్రైనేజీ పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, పరకాల పట్టణం వరద ముంపునకు గురికాకుండా పకడ్బందీ ప్రణాళికతో అభివృద్ధి చేస్తామని తెలిపారు. పట్టణాన్ని దశలవారీగా సుందరీకరణ చేసి, నగరాలకు దీటుగా తీర్చిదిద్దుతామని, అందుకు ప్రజల సహకారం అవసరమని అన్నారు. "కొద్దిపాటి వర్షానికే రోడ్లు జలమయం అవుతున్నాయి. ఒక ప్రణాళిక ప్రకారం మున్సిపాలిటీలో శానిటేషన్, డ్రైనేజీ, మంచి నీటి వ్యవస్థలను ఏర్పాటు చేస్తున్నాం" అని ప్రకాశ్ రెడ్డి తెలిపారు. సుమారు రూ. 24 కోట్లతో కొత్త డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నామని, అభివృద్ధి పనుల వల్ల ప్రజలకు తాత్కాలికంగా ఇబ్బందులు కలగవచ్చని, కానీ భవిష్యత్ తరాలకు అవి ఎంతో ఉపయోగపడతాయని ఆయన అన్నారు. అమృత్ పథకం కింద మంచి నీటి వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నామని, వరద ముంపు నుండి పట్టణాన్ని కాపాడేందుకు ఒక నివేదిక కూడా రూపొందించామని ఆయన తెలిపారు. గత ప్రభుత్వ పాలకుల నిర్లక్ష్యం వల్ల పరకాల పట్టణాభివృద్ధి వెనకబడిందని, స్వలాభం కోసం ప్రారంభించిన పనులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయని ఆయన విమర్శించారు. అంతకు ముందు, 18వ వార్డులో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను ఆయన పరిశీలించి, పనులను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. అలాగే, 14వ వార్డులోని ప్రభుత్వ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరిగేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఆయన ఆదేశించారు.

# బీసీ రిజర్వేషన్ల అమలులో కాలయాపన



**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** బీసీ రిజర్వేషన్లను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని, అందుకే ఆర్డినెన్స్‌లు, ఉత్తర్వుల పేరిట కాలయాపన చేస్తోందని భారతీయ జనతా పార్టీ జిల్లా కార్యదర్శి జడ సతీష్ విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ బీసీలను మోసం చేస్తోందని ఆయన ఆరోపించారు. అసెంబ్లీలో ఆమోదించిన బీసీ రిజర్వేషన్ల బిల్లుకు న్యాయపరమైన సమస్యలు ఉన్నాయని తెలిసినప్పటికీ, దానిని గవర్నర్‌కు పంపి కేంద్ర ప్రభుత్వంపై నిందలు మోపడానికి కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని సతీష్ అన్నారు. దీని ద్వారా స్థానిక సంస్థల ఎన్నికలను మరింత ఆలస్యం చేసి, ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతను తగ్గించుకోవడానికే కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని, బీసీలకు అధికారం కల్పించే ఉద్దేశం కాంగ్రెస్ పార్టీకి లేదని ఆయన పేర్కొన్నారు. బీసీలకు అధికారం ఇచ్చే ఆలోచన కాంగ్రెస్ పార్టీకి ఉంటే, బీసీని ముఖ్యమంత్రి చేయాలని, రాష్ట్ర మంత్రివర్గంలో పది మంది బీసీ మంత్రులను తీసుకోవాలని సతీష్ డిమాండ్ చేశారు. అలా చేయకుండా రిజర్వేషన్ల విషయంలో కపట నాటకం ఆడుతోందని ఆయన విమర్శించారు. తమ పార్టీలో, ప్రభుత్వ పదవుల్లో 42శాతం రిజర్వేషన్లు కేటాయించి కాంగ్రెస్ తమ చిత్తశుద్ధిని చాటుకోవాలని ఆయన సవాల్ విసిరారు. కాంగ్రెస్ పార్టీ చెప్పే మాయమాటలను బీసీలు నమ్మే పరిస్థితిలో లేరని సతీష్ అన్నారు. ఇప్పటికైనా 'ఢిల్లీలో ధర్నా చేస్తాం, రాష్ట్రపతిని కలుస్తాం' వంటి మాటలు మానుకొని, బీసీలకు న్యాయపరమైన రిజర్వేషన్లు కల్పించే పనిపై దృష్టి పెట్టాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు.

# చెరువులు నింపడానికి కాంగ్రెస్ చర్యలు



**వరంగల్ వాయిస్, రఘునాథపల్లి:** మండలంలోని ప్రతి చెరువును నింపడం కాంగ్రెస్ పార్టీ బాధ్యత అని మండల అధ్యక్షుడు కోళ్ల రవి గౌడ్ అన్నారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఆదేశాల మేరకు జనగామ జిల్లా గ్రంథాలయ చైర్మన్ మారుజోడు రాంబాబు, జిల్లా ఉపాధ్యక్షుడు లింగాల జగదీశ్ చందర్ రెడ్డి శనివారం మండలంలో కాలువలను పరిశీలించారు. బొమ్మకూర్ రిజర్వాయర్ నుంచి మంగలి బండ తండా, కిలా షాపూర్, పటేల్ చెరువులను నింపడానికి అవసరమైన కాలువలను నాయకులు పరిశీలించారు. కాలువల్లో పేరుకుపోయిన తుంగ, చెట్లను, మట్టిని జేసీబీ సాయంతో తొలగించారు. అసంపూర్తిగా ఉన్న కాలువ పనులను తక్షణమే పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్‌కు ఫోన్ చేసి ఆదేశించారు. మేకలగట్టు గ్రామానికి వెళ్లే కాలువలను కూడా పరిశీలించి, అసంపూర్తిగా ఉన్న పనులను వెంటనే ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రతి విషయాన్ని ఎమ్మెల్యే కడియం శ్రీహరి దృష్టికి తీసుకెళ్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు నామాల బుచ్చన్న, గాద మహేందర్ రెడ్డి, గంగిడి లక్ష్మారెడ్డి, మంగలి బండ తండ మాజీ సర్పంచ్ ప్రకాశ్ రెడ్డి, నారగోని కుమార్, వడ్లకొండ శివప్రసాద్, ఆయా గ్రామాల రైతులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# గోవిందాది కొండపై బల్లలు ఏర్పాటు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** నగరంలోని చారిత్రక గోవిందాది కొండపై ఉన్న స్వయంభు శ్రీ గోవిందరాజస్వామి, క్షేత్రపాలకుడు శ్రీ అభయాంజనేయ స్వామి దేవాలయంలో భక్తుల సౌకర్యార్థం రెండు సిమెంట్ బల్లలను ఏర్పాటు చేశారు. స్థానిక శివనగర్‌కు చెందిన అమ్మిరిశెట్టి భిక్షపతి తన దివంగత తల్లి రాజమ్మ జ్ఞాపకార్థం ఈ బల్లలను విరాళంగా ఇచ్చారు. ఆలయ ప్రధాన అర్చకులు శ్రీ వరయోగుల శ్రీనివాస స్వామి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో భిక్షపతితో పాటు ఆయన సోదరులు వెంకటేశ్వర్లు, రమేష్, వారి తండ్రి సదానందం పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో దేవాలయ పాలక మండలి అధ్యక్షుడు మరిపెల్లి సంజీవరావు, డీజే లడ్డు, శతగోపం అనిల్‌తో పాటు ఆలయ అర్చకులు శ్రీనివాస స్వామి, జగన్నాథం వేణు స్వామి, వరయోగుల కృష్ణమూర్తి, మురళీకృష్ణ, జగన్నాథం రాము తదితరులు, భక్తులు పాల్గొన్నారు.

# దత్తాత్రేయ దృష్టికి చేనేత కార్మికుల సమస్యలు



**వరంగల్ వాయిస్, హైదరాబాద్:** జాతీయ చేనేత దినోత్సవానికి పది సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా, చేనేత కార్మికుల సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని ది వీవర్స్ వెల్ఫేర్ ట్రస్ట్ బోర్డు ఛైర్మన్, మాజీ ఎమ్మెల్యే వన్నాల శ్రీరాములు మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయకు శనివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో గౌరవ సలహాదారులు వేముల సదానందం, పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేడం బాబురావు, బీజేపీ నాయకుడు కర్నాటి ధనుంజయ పాల్గొన్నారు. ప్రతి సంవత్సరం ఆగస్టు 7న జాతీయ చేనేత దినోత్సవం నిర్వహిస్తారు. భారత స్వాతంత్రోద్యమంలో చేనేత పరిశ్రమ కీలకపాత్ర పోషించిందని, స్వతంత్ర సాధనకు ఒక సాధనంగా నిలిచిందని శ్రీరాములు గుర్తుచేశారు. ఈ సందర్భంగా వన్నాల శ్రీరాములు మాట్లాడుతూ, రాష్ట్రంలో చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలను దత్తాత్రేయ దృష్టికి తీసుకెళ్ళారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత కేసీఆర్ ప్రభుత్వం సహకార సంఘాలకు, టెస్కోకు ఎన్నికలు నిర్వహించకుండా చేనేత కార్మికులను నష్టాల్లోకి నెట్టిందని వన్నాల ఆరోపించారు. ప్రభుత్వ సంస్థలు సహకార సంఘాల నుండి చేనేత వస్త్రాలను కొనుగోలు చేయాలన్న హైకోర్టు ఉత్తర్వులను కూడా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. పోచంపల్లి, సిరిసిల్ల, నల్గొండ, మహబూబ్ నగర్ జిల్లాలలో గత పన్నెండేళ్లలో చేతినిండా పనిలేక దాదాపు 800 మంది చేనేత కార్మికులు ఆకలిచావులకు గురయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన పలు డిమాండ్లు చేశారు. వెంటనే చేనేత సహకార సంఘాలకు, టెస్కోకు ఎన్నికలు నిర్వహించి సంఘాలను బలోపేతం చేసి చేనేత కార్మికులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. పెరుగుతున్న పత్తి వస్త్రాల వినియోగాన్ని దృష్టిలో పెట్టుకుని, అనేకమంది చేనేత కార్మికులకు పని కల్పించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. వ్యవసాయ రంగం తర్వాత అత్యధిక మందికి ఉపాధి కల్పిస్తున్న చేనేత రంగాన్ని బలోపేతం చేయాలని, తద్వారా కార్మికుల ఆకలిచావులు, ఆత్మహత్యలు ఆపాలని వన్నాల సూచించారు. ఆరు గజాల చీరను అగ్గిపెట్టెలో ఇమిడిపోయేలా నేసే చేనేత కళాకారులను ప్రభుత్వం ప్రోత్సహించాలని డిమాండ్ చేశారు. వ్యక్తిగత, మాస్టర్ వీవర్స్, చేనేత సహకార సంఘాలకు నూలు, సిల్క్, రంగులు, రసాయనాలను సబ్సిడీపై అందించాలని కోరారు. పోచంపల్లి, నారాయణపేట, గద్వాల వంటి ప్రాంతాలకు బెంగళూరు తరహా సిల్క్ డిపోలను ఏర్పాటు చేయాలని సూచించారు. దిగుమతి చేసుకునే సిల్క్ నూలుపై రవాణా, ఇతర సుంకాల భారాన్ని తగ్గించి చేనేత కార్మికులను ఆదుకోవాలని వన్నాల శ్రీరాములు ప్రభుత్వాన్ని కోరారు.

# పోరెడ్డి ప్రదీప్ రెడ్డి ఉదారత

## విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ



**వరంగల్ వాయిస్, ఆత్మకూరు :** మండలంలోని గుడెప్పాడ్ గ్రామ జిల్లా పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఒక సామాజిక సేవా కార్యక్రమం జరిగింది. దివంగత పోరెడ్డి రమాదేవి జ్ఞాపకార్థం, ఆమె కుమారుడు పోరెడ్డి ప్రదీప్ రెడ్డి ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆత్మకూరు సీఐ సంతోష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలలోని విద్యార్థులకు సీఐ సంతోష్ స్కూల్ బ్యాగులు, నోటు పుస్తకాలు, పెన్నులు, ఇతర విద్యాసామగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను కూడా ప్రభుత్వ పాఠశాలలోనే చదువుకున్నానని గుర్తు చేసుకున్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం పట్ల యువతను అభినందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి క్రాంతి, గ్రామ పెద్దలు సమ్మీ రెడ్డి, చిమ్మని భిక్షపతి, యువకులు సునీల్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, దినేష్, దిలీప్, పాఠశాల యాజమాన్యం, ఐసీడీఎస్ సూపర్వైజర్ ఉమాదేవి, అంగన్‌వాడీ సిబ్బంది, ఉపాధ్యాయులు మరియు స్థానికులు పాల్గొన్నారు. అనంతరం, అంగన్‌వాడీ టీచర్లు అంగన్‌వాడీ కేంద్రంలో తల్లి పాల వారోత్సవాలు నిర్వహించారు.



# 3న పద్మశాలి వధూవరుల వివాహ పరిచయ వేదిక

**వరంగల్ వాయిస్, వరంగల్:** తెలంగాణ పద్మశాలి ఉద్యోగుల సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా ఆధ్వర్యంలో 9వ రాష్ట్ర స్థాయి పద్మశాలి వధూవరుల వివాహ పరిచయ వేదికను ఆదివారం నిర్వహిస్తున్నట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు కోడం రవిప్రకాష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమం వరంగల్‌లోని పోచమ్మ మైదాన్, హనుమాన్ టెంపుల్ లేన్‌లోని కెమిస్ట్, డ్రగ్గిస్ట్ అసోసియేషన్ ఫంక్షన్ హాల్‌లో మధ్యాహ్నం 1:30 గంటలకు ప్రారంభమవుతుంది. ఈ కార్యక్రమానికి తెలంగాణ పద్మశాలి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఈగ వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా హాజరవుతారు. తెలంగాణ పద్మశాలి ఉద్యోగుల సంఘం 2015 నుంచి పద్మశాలి మ్యారేజ్ బ్యూరోను విజయవంతంగా నిర్వహిస్తోందని, గత పదేళ్లుగా ప్రతి సంవత్సరం ఈ వివాహ పరిచయ వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని కోడం రవిప్రకాష్ తెలిపారు. ఎలాంటి మధ్యవర్తిత్వం, కమిషన్ లేకుండా కేవలం సేవా దృక్పథంతో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాల వల్ల రాష్ట్రవ్యాప్తంగా వందలాది వివాహాలు కుదిరాయని ఆయన పేర్కొన్నారు. ఈ నెల 3న నిర్వహిస్తున్న ఈ వేదికను పద్మశాలి కుల బంధువులు, వధూవరుల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరుతున్నారు. కార్యక్రమంలో పాల్గొనే వధూవరులు తమ పూర్తి వివరాలతో పాటు పాస్‌పోర్టు సైజు ఫొటోతో హాజరుకావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్పాట్ రిజిస్ట్రేషన్ సదుపాయం కూడా అందుబాటులో ఉంటుందని, గతంలో సంఘం మ్యారేజ్ బ్యూరోలో రిజిస్ట్రేషన్ చేసుకున్న వారు మళ్లీ చేసుకోవాల్సిన అవసరం లేదని నిర్వాహకులు తెలిపారు. మరిన్ని వివరాల కోసం తెలంగాణ పద్మశాలి ఉద్యోగుల సంఘం కార్యాలయ కార్యదర్శి ములుక శ్రీనివాస్‌ను సెల్ నంబర్ 9704360703 లో సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

# నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదు



**వరంగల్ వాయిస్, రేగొండ :** విద్యార్థుల విషయంలో ఏ మాత్రం నిర్లక్ష్యం వహించినా ఉపేక్షించేది లేదని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు హెచ్చరించారు. శనివారం రేగొండ మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విద్యార్థులతో ఆప్యాయంగా మాట్లాడి, భోజనం నాణ్యత, వసతి, విద్యా ప్రమాణాల గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో కలిసి భోజనం చేసి, పాఠశాలలోని అన్ని సౌకర్యాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం విద్యకు పెద్ద పీట వేస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఇప్పకాయల నరసయ్య, వ్యవసాయ కమిటీ ఛైర్మన్ గుటోజు కిష్టయ్య, పీఏసీఎస్ ఛైర్మన్ విజ్జన్ రావు, మాజీ ఎంపీపీ పున్నం లక్ష్మీ రవి, జిల్లా నాయకులు మోడెం ఉమేష్ గౌడ్, మేకల బిక్షపతి, గండి తిరుపతి గౌడ్, మాజీ ఎంపీటీసీ మైస బిక్షపతి, పట్టెం శంకర్, ఓబీసీ మండల అధ్యక్షులు పొనుగోటి వీరబ్రహ్మం, కేజీబీవీ ప్రిన్సిపాల్ మనోరమ, కొత్తపల్లి గోరి మండల ఎంపీడీఓ గడ్డం రాంప్రసాద్ రావు, కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు ఏనుగు రవీందర్ రెడ్డి, వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్ జంగిలీ సుధాకర్, యూత్ అధ్యక్షుడు కోయిల క్రాంతి, యూత్ నాయకులు సామల సురేందర్ రెడ్డి, మేకల శివ పాల్గొన్నారు.

# ఉద్యోగులు, జర్నలిస్టులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

## హనుమకొండ డీఎంహెచ్ఓ అప్పయ్య



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** జిల్లాలోని ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి ఆవరణలో ఉన్న ఎంప్లాయీస్ జర్నలిస్ట్ హెల్త్ స్కీం (ఈజేహెచ్ఎస్) వెల్‌నెస్ సెంటర్‌లో ఉద్యోగులకు, జర్నలిస్టులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఏ. అప్పయ్య సూచించారు. మందుల కొరత లేకుండా ఎప్పటికప్పుడు స్టాక్ పరిశీలించి, అవసరమైన మందులను తెప్పించాలని ఆయన ఆదేశించారు. శనివారం డీఎంహెచ్ఓ డాక్టర్ అప్పయ్య, ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ నిఖిల్‌తో కలిసి వెల్‌నెస్ సెంటర్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు అందుబాటులో ఉన్న మందుల నిల్వలను, రికార్డులను పరిశీలించారు. అలాగే, ఓపీ విభాగంలో వైద్య సేవల తీరు, ల్యాబ్ మరియు ఇతర విభాగాల పనితీరును అడిగి తెలుసుకున్నారు. మందులతో పాటు ఏవైనా సమస్యలు ఎదురైతే ముందుగానే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని ఆయన సూచించారు. చికిత్స కోసం వచ్చిన వారితో ఓపికగా, మర్యాదగా వ్యవహరించి తగిన వైద్యం అందించాలని తెలిపారు. ఈ తనిఖీలో ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ నిఖిల్, డాక్టర్ చరణ్, డాక్టర్ సుస్మిత, డాక్టర్ చైతన్య, డెమో వి. అశోక్ రెడ్డి, శ్రవణ్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# మృతుడి కుటుంబానికి పరామర్శ

**వరంగల్ వాయిస్, పరకాల :** మండలంలోని లక్ష్మీపురం గ్రామంలో మంగళపల్లి లక్ష్మి అనారోగ్యంతో మృతి చెందగా, జాతీయ బీసీ సంక్షేమ సంఘం పరకాల నియోజకవర్గ ఇంఛార్జి అముదాలపెల్లి మల్లేశం గౌడ్ ఆమె కుటుంబాన్ని పరామర్శించారు. లక్ష్మి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు. లక్ష్మితో తనకు చిన్ననాటి నుంచి ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ, తన వంతుగా ఆ కుటుంబానికి ఆర్థిక సహాయం అందించారు.

# ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న కాంగ్రెస్ సర్కార్

## ◆ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య



**వరంగల్ వాయిస్, రఘునాథపల్లి:** ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వంపై మాజీ డిప్యూటీ సీఎం, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. నీతి, నిజాయితీ ఉంటే కడియం శ్రీహరి తక్షణమే తన పదవికి రాజీనామా చేసి ఎన్నికలకు సిద్ధం కావాలని ఆయన సవాల్ విసిరారు. శనివారం రఘునాథపల్లి మండలం యాపలగడ్డ, అశ్వరావుపల్లి, వెల్ది గ్రామాల్లో ఊరూరు ప్రచారం నిర్వహించిన సందర్భంగా రాజయ్య మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పునకు అనుగుణంగా పార్టీ ఫిరాయించిన 10 మంది ఎమ్మెల్యేలపై స్పీకర్ వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. త్వరలో రాష్ట్రంలో ఉప ఎన్నికలు వస్తాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు. స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపించిన రాజయ్య, ఆయన కుటుంబ సభ్యులు వేల కోట్ల రూపాయలు సంపాదించుకున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ కార్యకర్తల కష్టంతో గెలిచిన కడియం శ్రీహరి కాంగ్రెస్‌లోకి వెళ్లి ఆ పార్టీ కార్యకర్తలకు కూడా అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తూ, ఢిల్లీ కాంగ్రెస్ నేతల చెప్పుచేతల్లో పనిచేస్తోందని రాజయ్య మండిపడ్డారు. పార్టీ ఫిరాయించిన వారిపై స్పీకర్ చర్యలు తీసుకుని న్యాయస్థానం గౌరవాన్ని కాపాడాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గ ఇంచార్జి వై. కుమార్ గౌడ్, మండల బీఆర్ఎస్ కన్వీనర్ మున్సిపట్ల విజయ్, రాష్ట్ర నాయకులు పెండ్లి మల్లారెడ్డి, కుర రాజేందర్ నాయక్, మహిళా నాయకులు మడ్లపల్లి సునీత రాధాకృష్ణ, తిపారపు మమత, పెద్దగొని రాజు గౌడ్ పాల్గొన్నారు.

# వృద్ధులకు మెరుగైన సేవలు అందించాలి

## ◆ జిల్లా ప్రధాన న్యాయమూర్తి నిర్మలాగీతాంబ

**వరంగల్ వాయిస్, హనుమకొండ:** వృద్ధులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ నిర్మలా గీతాంబ అన్నారు. మహాత్మాగాంధీ స్మారక వైద్యశాల (ఎంజీఎం)లో సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వయోవృద్ధుల పోషణ సంక్షేమ చట్టం–2007పై ఏర్పాటు చేసిన శిక్షణ సదస్సులో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వృద్ధుల కోసం ఆసుపత్రులలో ప్రత్యేక వార్డులు, ఇతర సౌకర్యాలు కల్పించి వారికి మర్యాదపూర్వకమైన సేవలు అందించాలని సూచించారు. ప్రతి కుటుంబంలో పిల్లలు పెద్దల పట్ల ప్రేమ, గౌరవం చూపించాలని, అప్పుడే కుటుంబంలో చక్కని వాతావరణం నెలకొంటుందని అన్నారు. ఆస్తులు తీసుకుని వృద్ధులను వృద్ధాశ్రమాలలో చేర్చడం సరైంది కాదని హితవు పలికారు. వయోవృద్ధుల కోసం న్యాయ వ్యవస్థలను పునరుద్ధరించాలని ఆమె కోరారు. వైద్యశాలలపై ప్రజలకు విశ్వాసం పెరిగే విధంగా వైద్యులు, సిబ్బంది సేవలందించాలని సూచించారు. ఎంజీఎం సూపరింటెండెంట్ డాక్టర్ కిషోర్ కుమార్ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో డాక్టర్ సమ్మయ్య మాట్లాడుతూ, వృద్ధులకు ప్రత్యేక ఓపీ విభాగం ఏర్పాటు చేశామని, త్వరలో ప్రత్యేక వార్డును కూడా ఏర్పాటు చేస్తామని తెలిపారు. 'హెల్పేజ్ ఇండియా' సంస్థ రాష్ట్ర కోఆర్డినేటర్ శ్యామ్ కుమార్ మాట్లాడుతూ, సీనియర్ సిటిజన్స్ సమస్యలపై తమ



సంస్థ నిర్వహించిన సర్వేలోని వివరాలను తెలియజేశారు. '2007 తల్లిదండ్రులు, వయోవృద్ధుల పోషణ సంరక్షణ చట్టం'లోని ముఖ్య అంశాలపై ఆయన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు, రిటైర్డ్ డీఎస్పీ దామెర నర్సయ్య, ఓరుగల్లు వినియోగదారుల రక్షణ సమితి అధ్యక్షుడు కజాంపురం దామోదర్ ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ డీఎల్ఎస్ఏ కార్యదర్శి సీనియర్ సివిల్ జడ్జి ఎం. సాయికుమార్, డాక్టర్ మమత, అసోసియేషన్ కార్యదర్శి తేరాల యుగంధర్, కార్యవర్గ సభ్యులు నాగులగాం నర్సయ్య, మార్క రవీందర్ గౌడ్, సత్యనారాయణ, గంటి సాంబయ్య, గంగారపు యాదగిరి, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమం ముగింపులో వరంగల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తికి, ఎంజీఎం సూపరింటెండెంట్ డాక్టర్ కిషోర్ కుమార్‌కు సన్మానం చేశారు.

# ఏపీఎంగా రాజీరు బాధ్యతల స్వీకరణ



**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** మండలంలోని మదర్ థెరిసా మండల సమాఖ్యకు కొత్త ఏపీఎంగా అదరసంధి రాజీరు శనివారం బాధ్యతలు స్వీకరించారు. గత ఆరు సంవత్సరాలుగా ఇదే స్థానంలో విధులు నిర్వర్తించిన తోటకూరి కృష్ణమూర్తి సాధారణ బదిలీల్లో భాగంగా కేసముద్రం మండలానికి వెళ్లారు. ఈ సందర్భంగా కొత్త ఏపీఎం రాజీరుకు మదర్ థెరిసా మండల సమాఖ్య సిబ్బంది, విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్లు (వీఓఏ) ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో సీసీలు రమాదేవి, రవీందర్ రాజు, సుధాకర్, కాంతయ్య, మహిళా రైతు ఉత్పత్తిదారుల కంపెనీ సీఈఓ శ్రీనివాస్, అకౌంటెంట్ రాధిక, ఆపరేటర్ అరుణ, వీఓఏలు యాకస్వామి, సంధ్య, కవిత, జోష, లావణ్య, తదితరులు పాల్గొన్నారు.

# ఓసీటీ కాలనీలో ఆర్చి నిర్మాణం

**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** నగరంలోని ప్రసిద్ధి చెందిన ఓసీటీ కాలనీలో గత 15 సంవత్సరాలుగా అసంపూర్తిగా ఉన్న నర్సంపేట రోడ్డులోని ప్రధాన ఆర్చి నిర్మాణం శనివారం ప్రారంభమైంది. రాష్ట్ర మంత్రి కొండా సురేఖ ఆదేశాల మేరకు, కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా) సహకారంతో ఈ పనిని చేపట్టినట్లు ఓసీటీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు సొల్లేటి శ్రీధర్ రెడ్డి తెలిపారు. కాలనీవాసి గోపాల నవీన్ రాజు సహకారంతో తాము మంత్రి కొండా సురేఖను కలిసి ఈ సమస్యను విన్నవించగా, ఆమె వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని ఆదేశించారని శ్రీధర్ రెడ్డి వివరించారు. రానున్న రెండు మూడు నెలల్లో ఈ ఆర్చిని అంగరంగ వైభవంగా నిర్మిస్తామని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా పాత నిర్మాణాలను తొలగించి, కొత్త ఆర్చి నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి సహకరించిన మంత్రి కొండా సురేఖకు, కుడా చైర్మన్ ఇనగాల వెంకటరామిరెడ్డికి, కుడా అధికారులకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి దొంతుల శోభన్, వైస్ ప్రెసిడెంట్ సంజీవరావు, కొనగల శ్రీనివాస్, అశోక్ కుమార్, ప్రభాకర్, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.



# ఇసుక లారీ యజమానుల ధర్నా




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వరంగల్ జిల్లా ఇసుక లారీ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస నాయుడు నేతృత్వంలో సుమారు 20 మంది లారీ యజమానులు హనుమకొండలోని కేఎల్ రెడ్డి కాలనీలో ఉన్న ప్రాంతీయ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కార్యాలయం ముందు శనివారం ధర్నా చేపట్టారు. జూలై 31న దామెర మండలం ఒగ్లాపూర్ గ్రామం సమీపంలోని సైలని బాబా దర్గా వద్ద మైనింగ్, ఆర్‌టిఏ, రాష్ట్ర పన్నులు, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సంయుక్తంగా నిర్వహించిన రూట్ చెక్‌పోస్ట్‌లో లారీలను తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో అనుమతించిన బరువు కంటే అధికంగా ఇసుక తరలిస్తున్న వాహనాలను అధికారులు నిలిపివేశారు. దీనికి నిరసనగా లారీ యజమానులు ధర్నా నిర్వహించి, జరిమానాలు విధించకుండా తమ వాహనాలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అధికారుల విధులకు ఆటంకం కలిగించినందుకు గాను, విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ బి. అనిల్ కుమార్ ఫిర్యాదు మేరకు సుబేదారి పోలీసులు సంబంధిత లారీ యజమానులపై కేసు నమోదు చేశారు.

# డాక్టర్ హరికిషన్‌కు సత్కారం



**వరంగల్ వాయిస్, వరంగల్ :** నూతనంగా అనంతలక్ష్మి ప్రభుత్వ ఆయుర్వేద వైద్య కళాశాల సూపరింటెండెంట్‌గా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ హరికిషన్‌ను శనివారం బీసీ ఇంటెలెక్చువల్స్ ఫోరమ్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ సత్కార కార్యక్రమంలో పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళాశాల అభివృద్ధి, బీసీ విద్యార్థుల సంక్షేమం, ఆయుర్వేద వైద్య విధానాల విస్తరణ వంటి అంశాలపై విశ్లేషణాత్మక చర్చలు జరిగాయి. డాక్టర్ హరికిషన్ మాట్లాడుతూ, కళాశాల అభివృద్ధి కోసం అన్ని వర్గాల వారిని కలుపుకొని ముందుకు సాగుతానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అనంతలక్ష్మి ప్రభుత్వ ఆయుర్వేద వైద్య కళాశాల అభివృద్ధి సభ్యుడు డాక్టర్ సాంబమూర్తి, బీసీ ఇంటెలెక్చువల్స్ ఫోరమ్ వరంగల్ జిల్లా సమన్వయకర్తలు మండల పరశురాములు, ధర్మపురి రాజగోవిందు, అంకం చక్రపాణి, డాక్టర్ ఈశ్వర్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# శంభునిపేటలో తల్లిపాల వారోత్సవాలు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** నగరంలోని శంభునిపేట అంగన్‌వాడీ సెంటర్–1లో శనివారం తల్లిపాల వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీడీపీఓ విద్య, మెడికల్ ఆఫీసర్ రమ్య, కార్పొరేటర్ పోశాల పద్మ, సూపర్వైజర్లు కళ్యాణి, స్వప్న ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ముఖ్య అతిథులు మాట్లాడుతూ తల్లిపాల ప్రాముఖ్యత గురించి వివరించారు. తల్లి తప్పనిసరిగా పోషకాహారం తీసుకోవాలని, పిల్లలకు తల్లిపాలు తప్పనిసరిగా ఇవ్వాలని సూచించారు. అలా చేయడం వల్ల పిల్లలు ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఆఫీసర్ రమ్య, సుజాత, అంగన్‌వాడీ టీచర్ భవాని, హెల్పర్ సరిత, తల్లులు, పిల్లలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఓర్వలేక మాజీ ఎమ్మెల్యే నీచ రాజకీయం

## ■ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సయ్య

**వరంగల్ వాయిస్, రేగొండ :** భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావుపై మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి చేస్తున్న అసత్య ఆరోపణలను మానుకోవాలని కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు ఇప్పకాయల నర్సయ్య డిమాండ్ చేశారు. శనివారం రేగొండ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వానికి, ఎమ్మెల్యే సత్యనారాయణ రావుకు ప్రజల సంక్షేమం పట్ల పూర్తి చిత్తశుద్ధి ఉందని తెలిపారు. "ఎమ్మెల్యేగా సత్యనారాయణ రావు గెలిచిన కొద్దికాలంలోనే చేస్తున్న అభివృద్ధి పనులను చూసి ఓర్వలేక బర్ల రాజకీయం చేస్తున్నారా?" అని నర్సయ్య ప్రశ్నించారు. గతంలో వెంకటరమణారెడ్డి రెండుసార్లు ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ప్రస్తుత ఎమ్మెల్యే ఇలాంటి నీచ రాజకీయాలు చేయలేదని అన్నారు. వెంకటరమణారెడ్డి తన స్వలాభం కోసమే పనులు చేశారని, నియోజకవర్గ ప్రజల కోసం ఏమి చేశారో చెప్పాలని సవాల్ విసిరారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రోడ్డు వెడల్పు పేరుతో ఎందరి పేదల గుడిసెలు కూల్చారో ప్రజలకు తెలుసని, రోజుకో మాట చెబుతూ ప్రజలను మోసం చేయడం సరికాదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి భూపాలపల్లి ప్రజలు మెచ్చుకుంటున్నారని,



ఇది చూసి ఓర్వలేక బీఆర్ఎస్ నాయకులు అభివృద్ధిని అడ్డుకుంటున్నారని విమర్శించారు. ఈ నీచ రాజకీయాలకు తగిన గుణపాఠం ప్రజలే చెబుతారని హెచ్చరించారు. గతంలో ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు పోలీసు అధికారులను ఉపయోగించుకుని, వారిని అడ్డగోలుగా తిట్టడం వెంకటరమణారెడ్డి విజ్ఞతకే వదిలేస్తున్నామని, అయితే జిల్లా పోలీస్ యంత్రాంగానికి ఆయన క్షమాపణలు చెప్పాలని నర్సయ్య డిమాండ్ చేశారు. లేకపోతే అన్ని పోలీస్ స్టేషన్లలో పిటిషన్లు ఇస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మార్కెట్ కమిటీ చైర్మన్ గుటోజు కిష్టయ్య, పీఏసీఎస్ చైర్మన్ నడిపెల్లి విజ్జన్ రావు, జిల్లా నాయకులు మోడెం ఉమేష్ గౌడ్, మేకల భిక్షపతి, గండి తిరుపతి గౌడ్, ఓబీసీ మండల అధ్యక్షులు పొనగంటి వీరబ్రహ్మం, బానోతు రవీందర్, మేకల భిక్షపతి, టౌన్ అధ్యక్షుడు ఏనుగు రవీందర్ రెడ్డి, వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్ జంగిలీ సుధాకర్, యూత్ అధ్యక్షుడు కోయిల క్రాంతి, సామల సురేందర్ రెడ్డి, మేకల శివ తదితరులు పాల్గొన్నారు.

WARANGALVOICE
www.epaper.warangalvoice.net
www.warangalvoice.net

వరంగల్ వాయిస్ Evening Daily

GRATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet

శనివారం, ఆగస్టు 02, 2025

# మోసపూరిత పాలన సాగిస్తున్న బీజేపీ

### ◆సీపీఎం నాయకుడు జి.నాగయ్య




**వరంగల్ వాయిస్, వరంగల్:** కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజలను మోసపుచ్చే పాలన సాగిస్తోందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కామ్రేడ్ జి. నాగయ్య విమర్శించారు. శనివారం వరంగల్ జిల్లా కార్యాలయంలో జరిగిన సీపీఎం విస్తృత సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సమావేశానికి జిల్లా కమిటీ సభ్యులు సింగారపు బాబు అధ్యక్షత వహించారు. ప్రతి ఏడాది రెండు కోట్ల ఉద్యోగాలు, నల్లధనాన్ని వెలికితీసి ప్రజల ఖాతాల్లో రూ. 15 లక్షలు జమ చేయడం, రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించడం వంటి అనేక హామీలను బీజేపీ ప్రభుత్వం విస్మరించిందని నాగయ్య అన్నారు. ఉపాధి కూలీలకు చేతినిండా పని కల్పించడంలో, భారత ఆర్థిక వ్యవస్థను మెరుగుపరచడంలో విఫలమైందని మండిపడ్డారు. పహల్గామ్‌లో ఉగ్రవాదులను సజీవంగా పట్టుకోలేకపోవడం, మణిపూర్‌లో మహిళలను నగ్నంగా ఊరేగించిన ఘటనలు మన దేశానికి సిగ్గుచేటని ఆయన అన్నారు. గవర్నర్ల వ్యవస్థను ఉపయోగించి రాష్ట్రాల హక్కులను హరించేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని, దేశ సంపద కొద్దిమంది కార్పొరేట్ల చేతుల్లోకి వెళ్లేలా పాలన సాగిస్తోందని నాగయ్య ఆరోపించారు. ప్రజాస్వామ్యానికి మూల స్తంభాలైన లౌకికత్వం, ఫెడరలిజం, సామాజిక న్యాయాన్ని బీజేపీ తుంగలో తొక్కుతోందని, రాజ్యాంగాన్ని మార్చి మనువాద రాజ్యాంగాన్ని అమలు చేయడానికి కుయుక్తులు పన్నుతోందని ఆయన తీవ్రంగా విమర్శించారు. నూతన విద్యా విధానం పేరుతో చరిత్రను వక్రీకరిస్తోందని, స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను అమలు చేయలేకపోయిందని ఆయన అన్నారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఎన్నికల ముందు ఇచ్చిన హామీలైన ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, పెన్షన్లు, రైతు భరోసా, రుణమాఫీలను వెంటనే అమలు చేయాలని నాగయ్య డిమాండ్ చేశారు. వరంగల్ నగరంలో తాగునీరు, రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, వీధి దీపాల వంటి సమస్యలు పరిష్కారం కావడం లేదని ఆయన అన్నారు. ఈ సమస్యల పరిష్కారం కోసం ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో జిల్లావ్యాప్తంగా పోరాటాలు చేస్తామని, ప్రజలందరూ సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి సి.హెచ్. రంగయ్య, జిల్లా కమిటీ సభ్యులు రత్నమాల, ఆరూరి కుమార్, ప్రశాంత్, దుర్గయ్య, బషీర్, కోరబోయిన కుమారస్వామి, సాంబయ్య, స్వామి పాల్గొన్నారు.

## ఎన్‌హెచ్‌ఆర్‌సీ జిల్లా కార్యదర్శిగా దేవదానం నియామకం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిటీ (ఎన్‌హెచ్‌ఆర్‌సీ) హనుమకొండ జిల్లా కార్యదర్శిగా హనుమకొండ పట్టణానికి చెందిన మోచర్ల దేవదానం నియమితులయ్యారు. ఈ నియామకానికి సంబంధించిన ఉత్తర్వులను ఎన్‌హెచ్‌ఆర్‌సీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మొగుళ్ల భద్రయ్య ఆదేశాల మేరకు రాష్ట్ర అధికార ప్రతినిధి మాదాసు మొగిలయ్య శనివారం జారీ చేశారు. ఈ సందర్భంగా మోచర్ల దేవదానం మాట్లాడుతూ అవినీతి రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. తన నియామకానికి సహకరించిన రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మొగుళ్ల భద్రయ్యకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలి

### గ్రామ పంచాయతీ కార్యదర్శి నరేష్



**వరంగల్ వాయిస్, దామెర:** మండలంలోని ఒగ్గులాపూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని గ్రామ పంచాయతీ కార్యదర్శి ఇంజపెల్లి నరేష్ సూచించారు. శనివారం ఆయన గ్రామంలో ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా నరేష్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్లు బేస్‌మెంట్ స్థాయికి పూర్తి చేసిన లబ్ధిదారులు మొదటి విడత బిల్లులకు అర్హులవుతారని తెలిపారు. బేస్‌మెంట్ పనులు పూర్తి కాగానే, లబ్ధిదారులు వెంటనే ఆ పనులను పూర్తి చేసి బిల్లులు తీసుకోవాలని ఆయన సూచించారు.

## 'ఎమ్మెల్యే గండ్రపై దుష్ప్రచారం చేస్తే సహించం'



**వరంగల్ వాయిస్, శాయంపేట :** భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావుపై అసత్య ఆరోపణలు, దుష్ప్రచారం చేస్తే సహించేది లేదని కాంగ్రెస్ పార్టీ కొప్పుల గ్రామ అధ్యక్షుడు ఏరుకొండ శంకర్ హెచ్చరించారు. శనివారం శాయంపేట మండలం కొప్పులలో విలేకరులతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. "ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు నియోజకవర్గ చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా రోజుకు 18 గంటలు ప్రజల కోసం పనిచేస్తున్నారు. ఆయన పనితనం, ప్రజాదరణను చూసి ఓర్వలేని ప్రతిపక్ష నాయకులు అసత్య ప్రచారాలు చేస్తున్నారు" అని శంకర్ మండిపడ్డారు. ఎలాంటి వ్యాపారాలు లేకుండా నిజాయితీగా, పాలకుడిగా కాకుండా సేవకుడిగా పనిచేస్తున్నారని ప్రశంసించారు. గత ప్రభుత్వ హయాంలో శాయంపేట మండలం పూర్తిగా వివక్షకు గురైందని, సత్యనారాయణ రావు పాలనలో అభివృద్ధి స్పష్టంగా కనిపిస్తోందని ఆయన అన్నారు. "కళ్లు ఉండి చూడలేని గుడ్డివారు ప్రతిపక్ష నాయకులు" అని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ పార్టీ ఎప్పుడో ప్రజలకు దూరమైందని, ఎన్ని కుట్రలు చేసినా రాబోయే స్థానిక ఎన్నికల్లో వారికి గుణపాఠం తప్పదని హెచ్చరించారు. ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావుపై దుష్ప్రచారం చేస్తే, కాంగ్రెస్ కార్యకర్తలు సైనికుల్లా తరిమికొడతారని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఉద్యోగులు నిబద్ధతతో పనిచేస్తే గుర్తింపు



**వరంగల్ వాయిస్, శాయంపేట:** ప్రభుత్వ ఉద్యోగులు నిబద్ధతతో పని చేస్తే ప్రజల మన్ననలు తప్పక పొందుతారని కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి అన్నారు. శనివారం శాయంపేట మండల కేంద్రంలోని సురేఖ మండల సమైక్య ఏపీఎం శ్రీధర్ రెడ్డి బదిలీ సందర్భంగా ఆయనకు కాంగ్రెస్ నాయకులు వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా శ్రీధర్ రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో సత్కరించారు. అనంతరం బుచ్చిరెడ్డి మాట్లాడుతూ, ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు సహజమేనని అన్నారు. శాయంపేట మండలంలో సుదీర్ఘకాలం పనిచేసిన శ్రీధర్ రెడ్డి సేవలను ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు చిందం రవి, చింతల రవిపాల్, మారపల్లి రాజేందర్, మారపల్లి వరదరాజు, గజ్జి ఐలయ్య, లడే రాజ్‌కుమార్, మారపల్లి కట్టయ్య, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

## కాసర్ల శ్యామ్‌కు ఎమ్మెల్యే నాయిని అభినందనలు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** 71వ జాతీయ చలన చిత్ర అవార్డులలో ఉత్తమ గేయ రచయితగా పురస్కారం పొందిన హనుమకొండకు చెందిన సినీ గేయ రచయిత కాసర్ల శ్యామ్‌ను వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అభినందించారు. శ్యామ్‌తో ఫోన్‌లో మాట్లాడిన ఎమ్మెల్యే, హనుమకొండకు జాతీయ స్థాయిలో గుర్తింపు తేవడం గర్వకారణమని అన్నారు. "బలగం" సినిమాలో శ్యామ్ రాసిన పాటలు తెలంగాణ పల్లెల గొప్పదనాన్ని చాటి చెప్పాయని కొనియాడారు. పల్లె ప్రజల ప్రేమ, ఆప్యాయతలను స్పృశించిన ఈ పాటలతో పాటు, ఇప్పుడు వస్తున్న అనేక సినిమాల్లో మంచి పాటలు రాస్తూ ఈ ప్రాంత ఘనతను మరింత చాటేలా మరిన్ని అవార్డులు పొందాలని ఆయన ఆకాంక్షించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చలన చిత్ర పరిశ్రమను ప్రోత్సహిస్తోందని, దీనివల్ల ఈ ప్రాంత కళాకారులకు మంచి అవకాశాలు వస్తున్నాయని ఎమ్మెల్యే అన్నారు. కళలకు పుట్టినిల్లైన ఓరుగల్లు గర్వపడేలా శ్యామ్ జాతీయ స్థాయి గుర్తింపు పొందారని నాయిని రాజేందర్ రెడ్డి ప్రశంసించారు.


## బీసీ రిజర్వేషన్ల అమలులో కాలయాపన



**వరంగల్ వాయిస్, వరంగల్:** కామారెడ్డి డిక్లరేషన్‌కు అనుగుణంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని బీజేపీ వరంగల్ జిల్లా ఉపాధ్యక్షులు కనుకుంట్ల రంజిత్ కుమార్ డిమాండ్ చేశారు. బీసీ రిజర్వేషన్ల అమలు విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని, అందుకే ఆర్డినెన్స్‌లు, ఉత్తర్వుల పేరిట కాలయాపన చేస్తోందని ఆయన ఆరోపించారు. బీసీ రిజర్వేషన్ల బిల్లు అసెంబ్లీలో ఆమోదించి గవర్నర్‌కు పంపినప్పుడు, ఆ బిల్లుకు న్యాయపరమైన ఇబ్బందులు ఉన్నాయని కాంగ్రెస్ పార్టీకి తెలిసినప్పటికీ, కేంద్ర ప్రభుత్వంపై నిందలు మోపడానికే ఈ పని చేసిందని రంజిత్ కుమార్ విమర్శించారు. బీసీలకు అధికారం కల్పించే ఆలోచన కాంగ్రెస్ పార్టీకి ఉంటే, బీసీని ముఖ్యమంత్రి చేయాలని మరియు రాష్ట్ర మంత్రివర్గంలో పది మంది బీసీ మంత్రులను తీసుకోవాలని రంజిత్ కుమార్ డిమాండ్ చేశారు. అలా చేయకుండా రిజర్వేషన్ల విషయంలో కపట నాటకం ఆడుతోందని ఆయన ఆరోపించారు. తమ పార్టీ పదవుల్లో, ప్రభుత్వ పదవుల్లో 42శాతం రిజర్వేషన్లు కేటాయించి కాంగ్రెస్ పార్టీ తమ చిత్తశుద్ధిని చాటుకోవాలని ఆయన సవాల్ విసిరారు. కాంగ్రెస్ పార్టీ చెప్పే మాయమాటలను బీసీలు నమ్మే పరిస్థితిలో లేరని రంజిత్ కుమార్ స్పష్టం చేశారు. ఇప్పటికైనా 'ఢిల్లీలో ధర్నా చేస్తాం, రాష్ట్రపతిని కలుస్తాం' వంటి మాటలు మానుకొని, బీసీలకు న్యాయపరమైన రిజర్వేషన్లు కల్పించే పనిపై దృష్టి పెట్టాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు.

## 'సామాజిక చైతన్య యాత్ర' ప్రారంభం

**వరంగల్ వాయిస్, డోర్నకల్:** అమరుల జ్ఞాపకార్థం కల్లుగీత కార్మిక సంఘం ఆధ్వర్యంలో 'సామాజిక చైతన్య యాత్ర' ప్రారంభమైంది. శనివారం బొల్లగాని పుల్లయ్య 37వ వర్ధంతి సందర్భంగా ప్రారంభమైన ఈ యాత్ర సర్దార్ సర్వాయి పాపన్న జయంతి రోజున ఆగస్టు 18న ముగుస్తుంది. ఈ సందర్భంగా డోర్నకల్ మండలం గొల్లచెర్ల గ్రామంలో బొల్లగాని పుల్లయ్య వర్ధంతిని కల్లుగీత కార్మిక సంఘం జిల్లా కమిటీ ఘనంగా నిర్వహించింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, ధర్మ భిక్షం, తోట్ల మలుసూర్, దేశిని చిన్న మల్లయ్య, బైరు మల్లయ్య, మహబూబాబాద్ జిల్లాకు చెందిన గండి ఐలయ్య, పేరుమల్ల జగన్నాథం, బొల్లగాని పుల్లయ్య, మంద రాములు, బోయినపల్లి చిన్న గోపులు వంటి అమరులను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా డోర్నకల్ మండలంలోని అన్ని గ్రామాల్లో ఆటోలు, బైక్‌లతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కల్లుగీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు యమగాని వెంకన్న, గౌని వెంకన్న, జిల్లా నాయకులు గంధసిరి శ్రీనివాస్, గుదే వెంకన్న రెడ్డి, మల్ల శ్రీనివాస్, డోర్నకల్ మండల అధ్యక్ష, కార్యదర్శులు గాదె నాగేశ్వరరావు, మేకపోతుల అంజయ్య, కర్ణ, క్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు. అలాగే, చిలుకోడు, వెన్నారం, అమ్మపాలెం, గొల్లచెర్ల సొసైటీల అధ్యక్షులు, నాయకులు, బొంపల్లి శ్రీనివాస్, మోటాపోతుల ఓదేశ, సురభి చంద్రయ్య, మేకపోతుల వెంకన్న, మంద నాగయ్య, మంద శ్రీనివాస్, వివిధ వృత్తి సంఘాల నాయకులు నరిగె ఓదేశ, కొడవండ్ల సైదులు, పెంటిక వెంకట్ రాములు తదితరులు హాజరయ్యారు.



# అవార్డు గ్రహీతలకు చిరంజీవి శుభాకాంక్షలు

71వ జాతీయ చలనచిత్ర అవార్డుల్లో ఏడు కేటగిరీల్లో తెలుగు సినిమాకు అవార్డులు వరించాయి. బాలకృష్ణ కథానాయకుడిగా, అనిల్ రావిపూడి దర్శకత్వంలో రూపొందిన 'భగవంత్ కేసరి' చిత్రం 'ఉత్తమ ప్రాంతీయ తెలుగు చలనచిత్రం' అవార్డును గెలుచుకుంది. అలాగే ప్రశాంత్‌వర్మ దర్శకత్వంలో రూపొందిన మైథలాజికల్ సోషియో ఫాంటసీ 'హను-మాన్'.. ఉత్తమ యానిమేషన్ విజువల్ ఎఫెక్ట్స్ విభాగం లో ఉత్తమ చిత్రంగా ఎంపికైంది. 'బేబీ'కి బెస్ట్ స్క్రీన్‌ప్లే, బెస్ట్ సింగింగ్ అవార్డులు దక్కాయి. ఉత్తమ బాలనటి కేటగిరిలో 'గాంధీతాత చెట్టు-' సినిమా నుంచి సుకృతివేణి అవార్డుకు ఎంపికైంది. తెలుగు చిత్రాలు సత్తా చాటిన నేపథ్యంలో పలువురు ప్రముఖులు శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. ఈ క్రమంలో మెగాస్టార్ చిరంజీవి తన సోషల్ మీడియాలో జాతీయ అవార్డ్ గ్రహీతలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలుపుతూ పోస్ట్ చేశారు. 'తెలుగు టాలెంట్, తెలుగు సినిమాలు ఈసారి పదికి పైగా విభాగాల్లో అవార్డులు గెలుచుకోవడం చూసి ఎంతో గర్వంగా ఉంది.. ' అంటూ పోస్ట్ లో పేర్కొన్నారు. అలానే బాలయ్య నటించిన భగవంత్ కేసరి చిత్ర బృందానికి ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు. తెలుగు సినిమా విజేతలకు ప్రత్యేక అభినందనలు. భారతీయ సినిమాకి ఈ అవార్డులు మరింత ప్రోత్సాహాన్ని ఇస్తాయని చిరు అన్నారు.

# నా రాముడు ఎప్పటికీ రామ్‌చరణే

మహావతార్ నరసింహ డైరెక్టర్ అశ్విని కుమార్ హోంబలే ఫిల్మ్స్ బ్యానర్‌పై మహావతార్ సినెమాటిక్ యూనివర్స్నుంచి వచ్చిన తొలి మైథలాజికల్ యానిమేటెడ్ ఫీచర్ ఫిల్మ్ 'మహావతార్ నరసింహ' బాక్సాఫీస్ వద్ద హవా కొనసాగిస్తోంది. విడుదలైనప్పటి నుంచే అద్భుత రెస్పాన్స్ దక్కించుకున్న ఈ చిత్రం రెండో వీకెండ్‌లో మరింత కలెక్షన్స్ రాబడుతుంది. అడ్వాన్స్ బుకింగ్స్ పెద్ద ఎత్తున నమోదవుతుండటంతో, సినిమా హాళ్ల వద్ద సందడి నెలకొంది. ఈ విజయం నేపథ్యంలో దర్శకుడు అశ్విన్ కుమార్ కూడా చిత్రానికి మరింత బజ్ తీసుకొచ్చే భాగంగా పోస్ట్-రిలీజ్ ప్రమోషన్లలో పాల్గొంటున్నారు. ఇకపోతే, తాజాగా జరిగిన ఓ ఇంటర్వ్యూలో డైరెక్టర్ అశ్విన్ కుమార్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఒకవేళ ఈ ఫ్రాంచైజీలో లైవ్ యాక్షన్ ఫిల్మ్ తీసే అవకాశం వస్తే.. అందులో శ్రీరాముడిగా ఎవరిని తీసుకుంటారనే ప్రశ్నకు ఆయన నేరుగా రామ్‌చరణ్ పేరును చెప్పుకొచ్చాడు. నిజానికి సోషల్ మీడియాలో ఇప్పటికే రామ్‌చరణ్‌కి శ్రీరాముడి పాత్రకు భారీ డిమాండ్ ఉంది. డైరెక్టర్ అశ్విన్ కుమార్ తాజాగా చేసిన వ్యాఖ్యలు వాటికి మరింత అతన్ని ఇచ్చాయి. అయితే, దీనికి కారణం లేకపోలేదు.. ముఖ్యంగా ట్రిపుల్ ఆర్ చిత్రంలో అల్లూరి సీతారామరాజుగా రామ్‌చరణ్ చేసిన క్లైమాక్స్ విజువల్స్ చూసిన తర్వాత, అభిమానులు చరణ్ అచ్చం శ్రీరాముడిలా కనిపించారని అనేకమంది అభిప్రాయపడ్డారు. ఉత్తర భారతదేశంలోని ప్రేక్షకులలో కూడా ఈ పాత్రకు రామ్‌చరణ్‌ను మరింత దగ్గరగా అనిపించారని భావిస్తున్నారు. ఇప్పటికే మహావతార్ సినెమాటిక్ యూనివర్స్‌కు పునాది పడిపోయిన నేపథ్యంలో.. రాబోయే కాలంలో ఇందులో లైవ్ యాక్షన్ ప్రాజెక్ట్స్ కూడా రానున్నాయన్న అంచనాలు ఉన్నాయి. అందులో భాగంగా రామ్‌చరణ్ శ్రీరాముడిగా కనిపించబోతున్నారా..? అన్నది ఇప్పుడు ఆసక్తికరమైన ప్రశ్నగా మారింది. ఇకపోతే మహావతార్ నరసింహ సినిమా మరో మైలురాయిని చేరుకుంది. దేశంలోని యానిమేటెడ్ సినిమాల్లో చరిత్ర సృష్టించింది. హోంబలే ఫిల్మ్స్ బ్యానర్‌పై వచ్చిన ఈ సినిమా 8 రోజుల్లోనే రూ.60.5 కోట్లు- వసూళ్లను సొంతం చేసుకుంది. ఈ విషయాన్ని తెలుపుతూ నిర్మాణసంస్థ ఓ పోస్టర్‌ను విడుదల చేసింది. దేశంలో అత్యధిక వసూళ్లు సాధించిన సినిమాగా రికార్డు నెలకొల్పిందని పేర్కొంది.








# చెప్పు తెగుద్ది..

## అనసూయ స్ట్రాంగ్ వార్నింగ్

టాలీవుడ్ నటి, యాంకర్ అనసూయ కొందరు యువకులకు అసభ్య కామెంట్లు చేస్తే చెప్పు తెగుద్ది అంటూ స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చింది. ఆంధ్రప్రదేశ్ ప్రకాశం జిల్లా మార్కపూరంలోని ఓ షాపింగ్‌మాల్ ఓపెనింగ్‌లో భాగంగా అక్కడికి వెళ్లిన అనసూయని కొందరు ఆకతాయిలు కామెంట్లు- చేయడం మొదలుపెట్టారు. దీంతో అనసూయ వారికి గట్టిగా వార్నింగ్ ఇచ్చింది. చెప్పు తెగుద్ది.. మీ ఇంట్లో అమ్మ, చెల్లి, భార్య కుటుంబసభ్యులను ఇలాగే కామెంట్లు- చేస్తే ఊరుకుంటారా. పెద్దవాళ్లకి మర్యాద ఇవ్వడం మీ ఇంట్లో నేర్పలేదా అంటూ అనసూయ ఆగ్రహం వ్యక్తం చేసింది. కాగా ఇందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం వైరల్‌గా మారింది.



# ఓజీ నుంచి పవర్‌ఫుల్ సాంగ్

టాలీవుడ్ హీరో పవన్ కల్యాణ్ నటిస్తోన్న తాజా చిత్రం 'ఓజీ'. 'సాహో' ఫేం సుజీత్ దర్శకత్వంలో వస్తున్న ఈ చిత్రం సెప్టెంబర్ 25న ప్రేక్షకుల ముందుకు రానుంది. జపాన్ బ్యాక్‌డ్రాప్‌లో గ్యాంగ్‌స్టర్ కథాంశంతో ఈ సినిమా సిద్ధమవుతుండగా.. ఇప్పటికే వచ్చిన ఫస్ట్ లుక్‌తో పాటు గ్లింప్స్ అభిమానులను అలరించాయి ఇదిలావుంటే తాజాగా ఈ మూవీ నుంచి పవర్‌ఫుల్ సాంగ్ ఓజీ ఫైర్ స్టోమ్ర్ ని విడుదల చేశారు మేకర్స్. థమన్ సంగీతం అందించిన ఈ పాటకు థమన్ ఎస్ , నజీరుద్దీన్ భరతరాజ్ , సిలంబరసన్ టిఆర్ (శింబు) , దీపక్ బ్లూ, రాజా కుమారి కలిసి పాడారు.

# ట్రిబ్యునల్ సూచనలు అమలు చేయండి

◆ వరంగల్ కలెక్టర్ డా. సత్య శారద




**వరంగల్ వాయిస్, వరంగల్ :** జాతీయ హరిత ట్రిబ్యునల్ సూచనలు అమలు చేయాలని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ లో జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చాహత్ బాజ్ పాయి, ఆదనవు కలెక్టర్ సంధ్యారాణిలతో కలసి మునిసిపల్, కాలుష్య నియంత్రణ మండలి సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భం గా కలెక్టర్ మాట్లాడుతూ హరిత గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్జీటి) నిబంధనల ప్రకారం కోట చెరువును శుభ్రం చేయించాలన్నారు. ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణపై ఎన్జీటీ ఆదేశించిన విధంగా సాలిడ్ వేస్ట్ మేనేజ్ మెంట్, లిక్విడ్ వేస్ట్ మేనేజ్ మెంట్, బయో హజార్డ్ మేనేజ్మెంట్ లను ప్రాసెసింగ్ చేసి డాక్యుమెంట్ తయారు చేసి అందజేయాలన్నారు. ప్రస్తుతం ఉన్న లెగసీ వ్యర్థాలను టెండర్ ప్రాసెసింగ్ చేయాలన్నారు. ఎన్జీటీ విధి విధానల ప్రకారం 17 ఏకరాల ల్యాండ్ ను రాంపూర్ డంప్ యార్డ్ లో నిర్వహించడంతో పాటు బయో మైనింగ్ పూర్తి చేయడం జరిగిందని, కొనుగోలు చేసిన ల్యాండ్ కు టెండర్ ప్రక్రియ పూర్తి చేయడం జరిగిందని నియంత్రించడానికి ఎన్ఫోర్స్మెంట్ బృందాలను ఏర్పాటు చేయడం జరిగిందని బల్దియా కమిషనర్ తెలిపారు. ఎన్జీటి నిబంధనలను అమలు చేయాలని, పర్యావరణ పరిరక్షణ కోసం త్వరలో జరిగే వినాయక పండుగ సందర్భంగా మట్టి వినాయక ప్రతిమలను ప్రతిష్టించాలని, అందుకోసం కాలుష్య నియంత్రణ మండలి, పురపాలికల, కార్పొరేషన్ తరపు నుంచి ఉచితంగా మట్టి వినాయక విగ్రహాలను అందజేయాలని, నగరంలోని కాలనీ కమిటీలతో సమావేశాలు ఏర్పాటు చేసి కాలుష్యాన్ని అరికట్టడానికి మట్టి వినాయక విగ్రహాలను పూజించేలా అవగాహన కలిగించాలని అన్నారు. పాఠశాల విద్యార్థులకు మట్టితో వినాయక ప్రతిమలను తయారు చేసేలా శిక్షణ అందజేసి వాటినే కొనుగోలు చేసేలా చూడాలని కలెక్టర్ అన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్ఓ విజయలక్ష్మి, కాలుష్య నియంత్రణ మండలి ఈఈ సునీత, బల్దియా సీఎంహెచ్ఓ డాక్టర్ రాజారెడ్డి, ఇంచార్జి ఎస్ఈ మహేందర్, ఎంహెచ్ఓ డాక్టర్ రాజేష్, నర్సంపేట, వర్ధన్నపేట మునిపల్ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.



# అమ్మవారికి తొలి బోనం

◆ ఆదివారం కుమ్మర్ల సంఘం ఆధ్వర్యంలో నిర్వహణ

**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** వివిధ రూపాల్లో కొలువై ఉన్న అమ్మవారికి శ్రావణమాసం తొలి ఆదివారం కుమ్మర్లు తొలి బోనం సమర్పించడం ఆనవాయితీగా వస్తోంది. ఆ అమ్మ ఆశీస్సులతో సమాజం సుభిక్షంగా ఉండాలని, ఆ తల్లి చల్లని చూపులు మనందరిపై ఉండాలని ప్రార్థిస్తూ అమ్మకు బోనం సమర్పిస్తారని తెలంగాణ కుమ్మర్ల సంఘం, రాష్ట్ర అధ్యక్షులు బీసీ ఐక్య చైతన్య సమితి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు ఆకారపు మోహన్ అన్నారు. అయితే అమ్మవారికి కుండలోనే బోనం తీసుకురావడం ద్వారా అమ్మ ఆశీస్సులు శీఘ్రంగా లభిస్తాయన్నారు. పోచమ్మ మైదాన్ లోని శ్రీ పోచమ్మ తల్లి కనకదుర్గమ్మ దేవాలయంలో ఆదివారం కుమ్మర భక్తమండలి కమిటీ ఆధ్వర్యంలో పోచమ్మ బోనాలను అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు ఆయన వెల్లడించారు.



# కొండా సురేఖపై క్రిమినల్ కేసు ఫైల్ చేయండి

◆ పోలీసులకు సూచించిన నాంపల్లి కోర్టు
◆ ఈ నెల 21 వరకు టైం..
◆ మాజీ మంత్రి కేటీఆర్ పరువు నష్టం కేసులో సంచలన తీర్పు

**వరంగల్ వాయిస్, వరంగల్ :** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మాజీ మంత్రి కేటీఆర్ వేసిన పరువునష్టం దావా కేసులో మంత్రి కొండా సురేఖపై క్రిమినల్ కేసు నమోదు చేయాలంటూ నాంపల్లి కోర్టు శనివారం పోలీసులను ఆదేశించింది. ప్రాథమిక సాక్ష్యాలను పరిశీలించిన నేపథ్యంలో కొండా సురేఖపై ఈ నెల 21 లోగా నోటీసు జారీ చేయాలని కోర్టు సూచించింది. కేటీఆర్ పైన కొండా సురేఖ నిరాధారణమైన ఆరోపణలు చేశారన్న కేటీఆర్ న్యాయవాది వాదనలతో కోర్టు ఏకీభవించింది. ఫిర్యాదుతోపాటు సాక్ష్యుల వాంగ్మూలాలు, డాక్యుమెంట్ల పరిశీలించిన తర్వాత, నిందితురాలు కొండా సురేఖపై ప్రాథమిక కేసు ఉన్నట్టు కోర్టు గుర్తించింది. ఇక కొండా సరేఖ తరుపు న్యాయవాది వ్యక్తం చేసిన అభ్యంతరాలను కోర్టు తోసిపుచ్చింది. కేటీఆర్ చేసిన ఫిర్యాదు ఊహాగానాల ఆధారంగా ఉందని, సరైన సమాచారం లేదని, ఫిర్యాదు చేసిన పోలీస్ స్టేషన్ పరిధి తదితర అంశాలపై వారు లేవనెత్తిన అంశాలను కోర్టు తోసిపుచ్చింది. కొండా సురేఖ చేసిన ఆరోపణలు నిరాధారంగా ఉన్నాయని కేటీఆర్ తరపు న్యాయవాది సిద్ధార్థ్ పోగుల చేసిన వాదనతో ఏకీభవించిన కోర్టు, సురేఖపై కేసు నమోదు చేయవచ్చని తేల్చిచెప్పింది.

# యూరియాపై తప్పుడు లెక్కలు

◆ ఖరీఫ్ కేటాయింపులు 9.80 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే
◆ ఇప్పటికే 2.24 లక్షల మెట్రిక్ టన్నుల లోటు
◆ కేంద్రమంత్రి అనుప్రియా పటేల్‌కు మంత్రి తుమ్మల లేఖ




**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** పార్లమెంట్ సాక్షిగా యూరియా సరఫరాపై తప్పుడు లెక్కలు చెప్పడం శోచనీయమని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుగారు అన్నారు. రాష్ట్రానికి ఖరీఫ్ కాలానికి 9.80 లక్షల మెట్రిక్ టన్నులు కేటాయించి, పార్లమెంట్ లో మాత్రం 20.20 లక్షల మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉందని చెప్పడం శోచనీయమన్నారు. దీంతో రాష్ట్ర రైతులు అయోమయానికి గురయ్యే అవకాశం ఉందన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో యూరియా పరిస్థితులపై కేంద్ర రసాయనాలు, ఎరువుల శాఖ సహాయమంత్రి అనుప్రియ పటేల్ కు కేంద్ర రసాయనాలు, ఎరువుల విభాగం రాష్ట్రానికి కేటాయించిన ఎరువుల లేఖను జతపరిచి మంత్రి తుమ్మల లేఖ రాశారు. ఖరీఫ్ 2025 కోసం రాష్ట్రానికి కేవలం 9.80 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే కేటాయించిందని, కేటాయించిన దానిలో కూడా నెలవారి సరఫరా చేయాల్సిన దానికంటే తక్కువగా సరఫరా చేయడం వలన రాష్ట్రంలో యూరియా కొరత ఏర్పడిరదని లేఖలో పేర్కొన్నారు. ఎప్రిల్ నుంచి జులై వరకు కేటాయింపుల ప్రకారం 6.60 లక్షల మెట్రిక్ టన్నులు సరఫరా చేయాల్సి ఉండగా, కేంద్రం 4.36 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే సరఫరా చేసిందన్నారు. దీంతో రాష్ట్రంలో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపించారు. కేవలం తెలంగాణ రాష్ట్రంలోనే కాకుండా తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ లో కూడా ఈ పరిస్థితులు ఉన్నాయని గుర్తుచేశారు. యూరియా కొరతపై రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర రసాయనాలు, ఎరువుల శాఖ మంత్రి జేపీ నడ్డాకు లేఖలు కూడా రాయడం జరిగిందని అందులో పేర్కొన్నారు. పార్లమెంట్ లాంటి వేదికలలో కూడా తప్పుడు లెక్కలు సమర్పించడం రాష్ట్ర ప్రయోజనాలను దెబ్బతీయడమే అన్నారు. జూలై మాసం వరకు కేటాయింపుల ప్రకారం సరఫరా కాని 2.24 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను కలుపుకొని, ఆగస్టు నెలకు కేటాయించిన యూరియాను త్వరగా సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలని మంత్రి ఆ లేఖలో కోరారు.




# మోడీ స్వదేశీ వస్తు నినాదం

◆ ఇతర దేశాలపై ఆధారపకుండా సాగాలి
◆ ట్రంప్ టారిఫ్‌ల నేపథ్యంలో సంచలన వ్యాఖ్యలు

**వరంగల్ వాయిస్, వారణాసి :** ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగే దిశగా భారత్ పరుగులు పెడుతోందని ప్రధాని మోడీ మరోమారు ఉద్ఘాటించారు. ఇప్పుడు మన ఆర్థిక ప్రయోజనాలపై మరింత అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. ట్రంప్ టారిఫ్‌ల వేళ స్వదేశీ ఉత్పత్తులను పెంచాలంటూ పిలుపునిచ్చారు. భారత్ ఆర్థిక వ్యవస్థను ఉద్దేశిస్తూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమయ్యాయి. 'డెడ్ ఎకానమీ' అంటూ ఆయన చేసిన విమర్శలపై భారత ప్రధాని నరేంద్రమోదీ పరోక్షంగా స్పందించారు. ఉత్తరప్రదేశ్ పర్యటనలో ఉన్న ప్రధాని మోదీ వారణాసిలో నిర్వహించిన ర్యాలీలో మాట్లాడారు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా అనిశ్చితిన నెలకొంది. అన్ని దేశాలు తమ సొంత ప్రయోజనాలపైనే ఎక్కువగా దృష్టి పెడుతున్నాయన్నారు. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వం అన్ని చర్యలూ తీసుకుంటోందన్నారు. రాజకీయ పార్టీలు కూడా విభేదాలను పక్కనబెట్టి 'స్వదేశీ' ఉత్పత్తుల విప్లవానికి నడుంకట్టాలన్నారు. కేవలం భారతీయులు తయారుచేసిన వస్తువులను మాత్రమే కొనుగోలు చేయాలని మోదీ పిలుపునిచ్చారు. ఇటీవల భారత్–రష్యా బంధంపై ట్రంప్ స్పందిస్తూ.. ఇద్దరూ వారి మృత ఆర్థిక వ్యవస్థలను దిగజార్చు కోనీయండని, కలిసి మునగనీయండని విమర్శలు గుప్పించిన సంగతి తెలిసిందే. అంతకుముందు భారత్ పై 25శాతం సుంకాలు విధించిన అగ్రరాజ్యాధినేత.. రష్యా నుంచి చమురును కొనుగోలు చేస్తే అదనంగా పెనాల్టీలు ఉంటాయంటూ హెచ్చరించారు. ఈ నేపథ్యంలోనే మోదీ తాజాగా చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com